# గ్రంథాలయాలు

తరతరాల విజ్ఞాన సంపదను అందించేవి గ్రంథాలు. అటువంటి గ్రంథాలు గల నివాసాన్ని 'గ్రంథాలయం' అంటారు.పుస్తకాలనేవి ఈనాటివి కావు. ఎన్నో ఏళ్ళుగా అవి ప్రాచుర్యంలో ఉన్నాయి. పూర్వం భూర్జపత్ర, తాళపత్ర గ్రంథాలుండేవి. అప్పుడు కాగితం, ముద్రణాయంత్రాలు లేని కారణంగా అవి ఎక్కువమందికి అందుబాటులో ఉండేవికావు. కానీ ఈనాటి పరిస్థితి వేరు. ప్రతి పుస్తకానికీ ఎన్నో ప్రతులు తయారవుతూ అందరికీ అందుబాటులోకి వచ్చాయి.

అయ్యంకి వెంకటరమణయ్యగారు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, నాళం కృష్ణారావుగారు మొదలైనవాళ్ళు మన రాష్ట్రంలో గ్రంథాలయోద్యమాన్ని చేపట్టి గ్రంథాలయాలు స్థాపించారు. గ్రంథాలయ మహాసభలు నిర్వహించి పుస్తకాలు సేకరించి భద్రపరిచారు."గ్రంథాలయోద్యమ పితామహుడు" గా అయ్యంకి వెంకటరమణయ్యగారు ప్రసిద్ధిగాంచారు.

"చిరిగిన చొక్కా అయినా తొడుక్కో - కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో" అన్న కందుకూరి వీరేశలింగం పంతులుగారి మాటలు పుస్తకం యొక్క ప్రాశస్త్యాన్ని వ్యక్తపరుస్తున్నాయి."పుస్తకం హస్తభూషణం" ఆర్యోక్తి మనకు తెలుసుకదా! "ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక" ఒక్క సిరా చుక్కతో వ్రాసిన కొన్ని వాక్యాలు ఎంతో మందికి ప్రేరణనిస్తాయి. "పుస్తకాలు మనకు నిజమైన నేస్తాలు" అని చెప్పడంలో అతిశయోక్తి ఏమాత్రంలేదు.

"గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు" వ్యక్తి వికాసానికి, సర్వతోముఖాభివృద్ధికి గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడతాయి. ప్రపంచంలో గొప్ప గొప్ప గ్రంథాలయాలున్నాయి.అమెరికాలో గల 'కాంగ్రెస్ లైబ్రరీ', రోము నగరంలోని వాటికన్ లైబ్రరీ, అలాగే 'బ్రిటీష్ లైబ్రరీ' ప్రపంచంలో పేరొందాయి. మనదేశంలో చెన్నైలోని 'కన్నెమరా' గ్రంథాలయం, తంజావూరులోని 'సరస్వతీ మహలు', వేటపాలెంలోని 'సారస్వత నికేతనం', హైదరాబాదులోని 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయం', కడపలోని'సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయం' చెప్పుకోదగ్గవి.

**గ్రంథాలయాల వల్ల చాలా ఉపయోగాలున్నాయి :**

1.గ్రంథాలయాలు మనిషిని మనీషిగా(బుద్ధిశాలిగా)మారుస్తాయి.

2.మేథావులు తరతరాలుగా సంపాదించిన అనుభవాలు, ఆలోచనలు గ్రంథాలలో భద్రపరచబడతాయి.

3.దేశాభ్యుదయానికి, సమాజవికాసానికి మూలస్తంభాలు గ్రంథాలయాలు.

4.గ్రంథాలు తండ్రివలె ఆదేశిస్తాయి.తల్లివలె లాలిస్తాయి.మిత్రునివలె ఆదుకుంటాయి.గురువువలె బోధిస్తాయి.

**ముగింపు :** ఈనాడు పుస్తకపఠనం తగ్గిపోయింది.ఇది చాలా దురదృష్టకరం.మన జాతీయనాయకులైన గాంధీ,నెహ్రూ వంటినాయకులంతా పుస్తకపఠనం వలనే గొప్పవ్యక్తులు కాగలిగినారు. విద్యార్థులు తమ విరామ సమయంలో గ్రంథాలయాలకు వెళ్ళి గ్రంథపఠనం చెయడం ఒక మంచి అలవాటుగా చేసుకోవాలి. అలాగే మంచిపుస్తకాలను ఎంచుకోవడంతోపాటు మౌనపఠనం చేయడం మరచిపోరాదు.ప్రభుత్వంతోపాటు దాతలు ముందుకువచ్చి ఊరూర గ్రంథాలయాలు నెలకొల్పాలి.విద్యార్థులు కూడా పుస్తకాలను కొనడం,చదవడం ఒక అలవాటుగా చేసుకోవాలి.**'పుస్తకాలు మన నేస్తాలు' కదా!**